

ఛీత్తడి మార్కెట్!

నెల్లూరు కూరగాయల మార్కెట్ చిన్నవర్షానికే చిత్తడిగా మారింది. ప్రధాన మార్కెట్‌కి అనుబంధంగా పక్కనున్న స్థలంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ది ఇదే దుస్థితి. ఇక్కడ నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో ఈ దుస్థితి నెలకొందని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తడిగా మారిన కూరగాయలు కొనేందుకు వినియోగదారులూ విముఖత వ్యక్తం చేస్తున్నారు.

–ఈనాడు, నెల్లూరు

ఈనాడు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం అక్టోబరు 10, 2024

అమ్మ వైభవం ఆనంద పరవశం

వాగ్దేవికి ప్రణమిల్లిన భక్తజనం

శరన్నవరాత్రుల వైభవం.. మూలా నక్షత్రం.. చదువుల తల్లి సరస్వతీదేవిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు ఆనందపరవశులయ్యారు. ముఖ్యంగా విద్యార్థులు ఆలయాలకు వరుస కట్టారు. వాగ్దేవి కటాక్షం కోసం ప్రణమిల్లారు. ఆయా ఆలయాల వద్ద జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మికతను ఇనుమడింపజేస్తున్నాయి.

- ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే బృందం



నెల్లూరు: సరస్వతీదేవిగా కన్యకా పరమేశ్వరి



కందుకూరు : వాసవీనగర్‌లో దుర్గాదేవికి పెన్నులతో అలంకరణ



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కోలాటం



కలశాలతో రాజరాజేశ్వరి ఆలయానికి తరలివస్తూ..



కన్యకా పరమేశ్వరి ఆలయంలో వీణానాదం



పెంచలకోనలో విద్యాలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు





సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో..

మంచినీరు.. ఉప్పులై..

తీర ప్రాంత గ్రామాల్లో అవస్థలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు మంచినీటికి కటకటలాడుతున్నారు. రొయ్యల సాగు ప్రభావమో.. మరే కారణమో.. తాగునీటి వనరుల్లోని మంచినీరు కాస్త ఉప్పులుగా మారడం సమస్యను జటిలం చేసింది. దీంతో భారమైనా ప్రజలు శుద్ధజలం కొనుగోలు చేస్తుండగా.. నిర్దేశిత పథకాలను గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శాపంగా మారింది. కావలి నియోజకవర్గంలో ఈ పరిస్థితి నెలకొంది.

● బోగోలు మండలంలో 16 గ్రామాలు, అల్లూరు 15, కావలి గ్రామీణ మండలంలో 13 గ్రామాలు తీరం వెంబడి ఉండగా- సముద్రం దగ్గర్లో ఉండటం, రొయ్యల సాగు ఇబ్బడిముబ్బడిగా విస్తరించడం తదితరాల కారణంగా భూగర్భ జలాలు ఉప్పులుగా మారాయి. సుమారు 15 ఏళ్లుగా ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మంచినీటి లభ్యత కోసం ప్రభుత్వాలు భారీగా వ్యయం చేసి బోర్లు వేసినా.. 90 శాతం తాగునీటికి యోగ్యం కాకుండా పోవడం శాపంగా మారింది.

ప్రధాన పథకాలకు గ్రహణం

అల్లూరులో 2000-01లో అక్కడి చెరువులో వంద ఎకరాల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రూ. 4 కోట్ల అంచనాలతో పనులు చేశారు. అప్పట్లో కట్టిన నిర్మాణాలు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. అల్లూరు నగర పంచాయతీ ప్రజలు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారు. బోగోలు మండలంలో జక్కెపల్లి గూడురు వద్ద సీపీడబ్ల్యూ పథకానికి 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ. 16 కోట్లు కేటాయించింది. 80 శాతం పనులు పూర్తి చేసినా.. గత ప్రభుత్వం గాలికి వదిలేసింది. దాంతో మరో రూ. 19 కోట్లు మురిగిపోయినట్లు సమాచారం. కావలి గ్రామీణ మండలంలోని చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాలెంలోనూ తాగునీటి సమస్య ఉంది. మిగతా గ్రామాలకు తుమ్మలపెంట వద్ద ఉన్న పథకం ఆసరాగా నిలుస్తోంది. జల్‌జీవన్ పనులనైనా వేగంగా పూర్తి చేస్తే ప్రజలకు ఊరట లభించే అవకాశం ఉంది.



నిరుపయోగంగా సీడబ్ల్యూఎస్ పథకం మదర్ ప్లాంట్

శాశ్వత పరిష్కారంపై దృష్టి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి శుద్ధ జలం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– లీలాప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, కావలి

నన్ను సంప్రదించకుండా.. బదిలీ చేశారు

హైకోర్టును ఆశ్రయించిన జడ్పీ ఛైర్‌పర్సన్


ఈనాడు, అమరావతి: తనను సంప్రదించకుండా.. ఆమోదం తీసుకోకుండా జిల్లా పరిషత్తు పరిధిలోని ఉద్యోగులను ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) బదిలీ చేశారని పేర్కొంటూ నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. బదిలీ ఉత్తర్వుల అమలును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. గత జీవోలకు విరుద్ధంగా.. ఎంపీడీవోలు, జడ్పీ, మండల ప్రజాపరిషత్ ఉద్యోగులు, సిబ్బంది బదిలీకి సీఈవో ఆమోదం తెలిపారన్నారు. 1996లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 3 ప్రకారం జడ్పీ ఉద్యోగులను బదిలీ చేసే ముందు.. ఛైర్‌పర్సన్ అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్, నెల్లూరు జడ్పీ సీఈవోను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత గురువారం విచారణ జరపనున్నారు.

రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపిక



అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఏఎస్‌పేటకు చెందిన **పి. రహీంఖాన్** ఎంపికయ్యారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(డీసీసీఐ), నారాయణ సేవాసంస్థాన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరగనున్న టోర్నమెంట్‌లో రహీంఖాన్ పాల్గొననున్నారు. ఆంధ్రరాష్ట్ర దివ్యాంగుల జట్టులో చోటు దక్కడం, జాతీయ పోటీలకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) గౌరవ అధ్యక్షుడు కేశినేని చిన్ని, వైస్‌ఛైర్మన్ సానా సతీష్‌బాబుకు ఏపీ స్టేట్ దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

భూమి మీదైతే.. బాధ తెలిసేది?



- గ్రామసభలు నిర్వహించకుండానే సేకరణ
- రెండేళ్లుగా భూమికి, సాగుకు దూరం
- పరిహారానికి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ఈనాడు, నెల్లూరు

రామాయపట్నం ఓడరేవు నిర్మాణంతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి.. భూములిచ్చిన రైతులు కన్నీరుపెట్టుకునే పరిస్థితి నెలకొంది. పోర్టుకు అనుబంధంగా ఏర్పడే పరిశ్రమలతో తమ బిడ్డలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. కనీస సమాచారం లేకుండా.. భూములను లాక్కున్న అప్పటి ప్రభుత్వం.. పరిహారం ఇవ్వడంలో జాప్యం చేసిందని మండిపడుతున్నారు. ఉపాధి అవకాశాలు పక్కనపెడితే.. మూడేళ్లుగా సాగులేక, ఉన్న భూములను అమ్ముకునే అవకాశం లేక.. పిల్లల పెళ్లిళ్లు, చదువులకు డబ్బు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం, మొండివారిపాలెం ప్రాంతాల్లో నిర్మిస్తున్న రామాయపట్నం ఓడరేవుకు అనుబంధంగా పరిశ్రమలు తీసుకొస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రాంతంలో ఏ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు? అక్కడి ప్రజలు కోల్పోతున్న భూములకు ఎంత మేరకు పరిహారం ఇస్తారన్న అంశాలను గ్రామసభలు నిర్వహించి, వివరించాల్సి ఉండగా- అవేమీ పట్టించుకోకుండా 2022, నవంబరులో నోటిఫికేషన్ ఇచ్చింది. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు పేరుతో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రావూరు, చేవూరు గ్రామాల్లోని 4,827.04 ఎకరాలను సేకరిస్తున్నట్లు ప్రకటించింది. కేవలం అప్పటి కలెక్టర్ లేఖ ఆధారంగా 2022, 2023ల్లో కేటాయింపునకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

సాగు చేయక.. అమ్ముకోలేక...

ఇండోసోల్‌కు భూములు కేటాయించేందుకు.. అప్పటి ప్రభుత్వం 2013 పునరావాస చట్టం ప్రకారం వర్తించే కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చింది. రెవెన్యూ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌పై రైతులు విముఖత వ్యక్తం చేసినా.. అవేమీ లెక్కపెట్టకుండా అధికారులు భూములు సేకరించడం గమనార్హం. గ్రామాలను వదిలేసి.. చుట్టూ ఉన్న భూములను సేకరణ పేరుతో 22ఏలో పెట్టడంతో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు.

ప్రకటనలోనూ.. వ్యత్యాసం

ఇక్కడ భూమి రిజిస్ట్రేషన్ విలువ రూ. 7.70 లక్షలు ఉంటే.. మార్కెట్‌లో రూ. 40 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు పలుకుతోంది. తమకు కేవలం రూ. 23 లక్షలే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. భావనపాడు పోర్టుకు సేకరించిన భూమి ఎకరా రూ. 4.40 లక్షలు ఉంటే.. రూ. 25 లక్షలు ఇచ్చారని, ఇక్కడ అంతకంటే ఎక్కువ ఉన్నా. . తక్కువ ఇస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇళ్లను మాత్రమే ఉంచి, మిగిలిన భూములన్నీ లాక్కోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదని కన్నీటిపర్యంతమవుతున్నారు. ఎన్నికలప్పటి నుంచి పరిహారం అందడం ఆగిపోగా.. ప్రస్తుతం అసైన్డ్, చుక్కల భూముల విషయంలోనూ మెలిక పెడుతున్నారని ఆందోళన చెందుతున్నారు.

- పారిశ్రామిక వాడ: ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్
- భూసేకరణ గ్రామాలు: చేవూరు, రావూరు
- ఎకరాలు 4,827
- పరిహారం(అంచనా) రూ.990 కోట్లు
- ఇప్పటివరకు ఇచ్చింది రూ.100 కోట్లు
- ఎన్ని ఎకరాలకు 500
- ఇంకా ఇవ్వాల్సింది రూ.890 కోట్లు



పరిశ్రమల నిమిత్తం సేకరించిన భూములు

అర్హులందరికీ పరిహారం

గుడ్లూరు మండలంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు, ఇతర అవసరాలకు 9,400 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేవూరు, రావూరు, చెన్నాయపాళెంలో భూసేకరణ ప్రస్తుతం వివిధ స్థాయిలో ఉంది. ఇప్పటి వరకు దాదాపు 500 ఎకరాలకు పరిహారం ఇచ్చాం. మిగిలిన వారికి విడతల వారీగా అందజేస్తాం. సరైన ధ్రువీకరణ పత్రాలు అందిస్తే అసైన్డ్ భూములకూ అందజేస్తాం. – పద్మావతి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ విభాగం

అనుమానిత కాల్ వస్తే నమ్మొద్దు: ఎస్పీ



నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా కాల్ చేస్తే నమ్మొద్దని ఎస్పీ **జి. కృష్ణకాంత్** బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారనీ, అప్రమత్తంగా ఉంటేనే మంచిదన్నారు. సీబీఐ, ఈడీ, కస్టమ్స్, ఏసీబీ అధికారులు వీడియో కాల్స్ చేయరనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అపరిచితుల ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, అనామకులు పంపే వెబ్‌సైట్స్ లింకులు, ఏపీకే ఫైల్స్‌ను తెరవరాదని సూచించారు. రూ. వేలల్లో పెట్టుబడులు, లక్షల్లో లాభాలంటూ వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులకు వచ్చే ప్రకటనలను విశ్వసించవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే.. వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే.. పోగొట్టుకున్న నగదు 48 గంటల్లో తిరిగి ఖాతాలో జమయ్యే అవకాశం ఉందన్నారు. బాధితులు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సైబర్ మిత్ర వాట్సాప్ నంబరు 9121211100, 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ సైబర్‌క్రైమ్. జీవోవీ. ఇన్‌లకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

అదే పంథా.. ఇసుక దందా!

కోడూరుపాడులో రెచ్చిపోతున్న అక్రమార్కులు

ఈనాడు, నెల్లూరు

'ఇసుక అక్రమ రవాణా జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 350 మందిపై కేసులు నమోదు చేశాం. 290కి పైగా వాహనాలు సీజ్ చేశాం. ఎవరైనా ఇసుక అక్రమ తవ్వకాలపై సమాచారం ఇస్తే.. వెంటనే చర్యలు తీసుకుంటాం.- ఇవి రెండు రోజుల కిందట.. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ చెప్పిన మాటలు.

– క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. రాత్రయితే చాలు ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పెన్నానదికి తూట్లు పొడుస్తున్నారు.

అలాగని, ఇదేదో మారుమూల ప్రాంతంలో జరుగుతుందనుకుంటే పొరపాటే.. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కోడూరుపాడులో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. వీలైనన్ని ఎక్కువ ట్రిప్పులు బయటకు తరలించాలనే ఉద్దేశంతో.. అతివేగంగా వాహనాలు నడుపుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గిరాకీని దృష్టిలో పెట్టుకుని...

నాయకుల అండదండలతో కోడూరుపాడులో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గిరాకీని దృష్టిలో పెట్టుకుని.. సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులకు ఆస్కారం ఇవ్వవద్దని ప్రభుత్వం పదేపదే చెబుతున్న మాటలను పెడచెవిన పెడుతూ.. దోపిడీనే పరమావధిగా సాగుతున్నారు. నెల్లూరు నగరం, రూరల్ పరిధిలోని స్థిరాస్తి వ్యాపారులు, భవన నిర్మాణదారులు, గుత్తేదారులతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని.. ఆ ప్రకారం వారం, పది రోజులకు ఒకసారి పెన్నానదిని కుళ్లబొడుస్తున్నారు. తవ్వకాలు జరిగే రోజు సాయంత్రం 6 గంటల తర్వాత వాహనదారులకు సమాచారం ఇవ్వడం.. రాత్రి పది గంటల తర్వాత దందా మొదలుపెట్టి.. తెల్లవారుజాము వరకు కొనసాగించడం ఇక్కడ పరిపాటిగా మారింది.



రాత్రి ఇసుక తవ్వకాలకు వెళ్తూ.. అదుపు తప్పి గోడను ఢీకొట్టిన ట్రాక్టర్

పెన్నా పొర్లుకట్టను ధ్వంసం చేసి.. ట్రాక్టర్లతో ఇసుక తీసుకొస్తున్న అక్రమార్కులు.. దాన్ని కోడూరుపాడులోని ఓ లేఅవుట్‌లో డంప్ చేసి.. అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అతివేగంతో దూసుకువెళుతున్న వాహనదారుల దెబ్బకు ఇళ్లలో నిద్రపోలేకపోతున్నామని, బయటకు వస్తే ప్రమాదాలకు గురవుతామనే భయంతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● దీనిపై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వివరణ కోరగా.. రాత్రిపూట నిఘా పెంచుతామన్నారు. కోడూరుపాడులో ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు అందాయి. ప్రత్యేక దృష్టిపెట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: ప్రయాణికులు ఫోన్ ద్వారా తెలిపిన సమస్యలు పరిష్కరిస్తామని ఆర్టీసీ నెల్లూరు-2 డిపో మేనేజర్ శివకేశ్ యాదవ్ హామీ ఇచ్చారు. నెల్లూరు డిపో-2 పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన వెంకటయ్య మాట్లాడుతూ రాజుపేట బస్సులో కండక్టర్ ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి డీఎం సమాధానమిస్తూ రాజుపేట బస్సు నెల్లూరు-1 డిపో పరిధిలోకి వస్తుందని, ఈ డిపో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వివిధలూరు మండలం అన్నారెడ్డిపాళేనికి చెందిన ప్రయాణికురాలు లక్ష్మీప్రసూన మాట్లాడుతూ నెల్లూరు నుంచి కూరుకు వెళ్లే సర్వీసులను బెలుగుంట మీదుగా ఎలక్ట్రానిక్ సిటీ వరకు నడపాలని కోరారు. డీఎం మాట్లాడుతూ పరిశీలించి.. తగు చర్యలు తీసుకుంటామన్నారు.



హమ్మయ్య.. భక్తులకు కష్టాలు తీరాయి

కొండబిట్రగుంటకు వచ్చే భక్తులకు కష్టాలు తీరాయి. బిట్రగుంట నుంచి వచ్చే మార్గంలో ముళ్లపొదలు పెరగడంతో గుడికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మంగళ, బుధవారాల్లో మూడు కిలోమీటర్ల పరిధిలో చెట్లు తొలగించారు. కోతకు గురైన రోడ్డు అంచులకు మరమ్మతులు చేశారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సూచనలతో బోగోలు మండల మాజీ అధ్యక్షుడు సుధాకర్ ముళ్ల పొదలు తొలగించారు.

– న్యూస్‌టుడే, బిట్రగుంట

ఈత.. కారాదు కడుపుకోత

కలిగిరి మండలంలోని కాలువలకు ఐఏబీ సోమశిల జలాలు వదిలారు. దీంతో మండలంలోని కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. దసరా సెలవులు కావడంతో కాలువ నీటిలో సరదాగా ఈత కొడుతున్నారు. ఈత రాని వారు జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే నీటిలో కొట్టుకుపోతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సీతారామపురం, న్యూస్‌టుడే



నగరంలో ఐల్యాండ్ల పరిశుభ్రం

నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న ఐల్యాండ్లను శుభ్రం చేస్తున్నారు. నెల్లూరులో మొత్తం 8 ఐల్యాండ్లున్నాయి. నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు, ఐల్యాండ్లు, హోర్డింగులను శుభ్రం చేయాలని ఐఏఎస్ జరిగిన ఓ సమావేశంలో కలెక్టర్ సూచించిన నేపథ్యంలో అధికారులు కదిలారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో నీళ్లు కొడుతుంటే.. గోడలకు అతికించిన కాగితాలను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించారు.

–ఈనాడు, నెల్లూరు







ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్

పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయండి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరులోని అల్లీపురం వద్ద శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని ఏపీ టిడ్కో కార్పొరేషన్ ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కలిసి వినతి పత్రం అందించారు. స్థానికంగా చోరీలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఇక్కడ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తే శాంతిభద్రతల పరిరక్షణ ఉంటుందని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. మొబైల్ పోలీసు పెట్రోల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట టిడ్కో ప్రాజెక్టు అధికారి మహాలక్ష్మి శాస్త్రి తదితరులున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

అల్లూరు, న్యూస్‌టుడే : సాగుకు ముందు విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు రావని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. బుధవారం మండలంలోని బీరంగుంటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ విత్తనశుద్ధితో ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. కార్యక్రమంలో కావలి ఏడీఏ నాగరాజు, వ్యవసాయాధికారి శ్రీహరి నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

సేవ చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ

వారంతా చిన్నతనం నుంచే సేవాభావం పెంపొందించుకున్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడినా.. పేదవారికి మేమున్నామంటూ బాసటగా నిలుస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు. - న్యూస్‌టుడే, ఎ.ఎస్.పేట

ఉపాధ్యాయ వృత్తి.. సేవా నిరతి





ఎ.ఎస్.పేటకు చెందిన **దొరబాబు** ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే.. సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి మరీ రక్తదానం చేస్తున్నారు. ఇలా.. పదిహేను సార్లు రక్తమందించారు. శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు తరచూ రక్తదానం చేస్తున్నారు. తండ్రి హజరత్తయ్య పేరుతో పాఠశాలలకు బీరువాలు, ఇతర సామగ్రి ఇస్తున్నారు. సుమారు రూ.లక్ష వెచ్చించి ఎఎస్‌పేటలోని ఉన్నత పాఠశాలకు శుద్ధజల యంత్రం అందజేశారు. దాని కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు.

తనవంతు సాయం

అనుమసముద్రానికి చెందిన **సందాని..** కులమతాలకతీతంగా ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారు. గ్రామంలోని మసీదు అభివృద్ధికి రూ.మూడు లక్షలు, గుడిపాడులో రామాలయానికి ఆలయానికి రూ.50వేలు అందజేశారు. క్రైస్తవుల పండగల సమయంలో స్థానిక చర్చి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తూ.. ప్రోత్సహిస్తున్నారు. గిరిజనులకు మంచాలు, దుప్పట్లు అందిస్తున్నారు. పాఠశాలలకు కుర్చీలు, టేబుళ్లు, విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తుంటారు.



వినాయక చవితి సందర్భంగా బహుమతులు అందజేస్తూ..

భక్తులకు ఉచితంగా..

ఎ.ఎస్.పేట వాసి **అజ్మల్** స్థానికంగా భోజనశాల నిర్వహిస్తున్నారు. ఎఎస్‌పేట దర్గాను దర్శించుకోవడానికి వచ్చే పేద భక్తులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. అన్నదానం చేస్తుంటారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు ఆర్థిక సాయం చేస్తున్నారు. సుమారు 30 వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు బీరువా, మంచాలు ఇతర సామగ్రి అందజేశారు.

అల్పాహారం అందిస్తూ..

హసనాపురానికి చెందిన **శ్రీహరి** డ్రైవరు ఉద్యోగం చేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేయిస్తారు. ప్రతి నెలా దర్గా వద్ద ఉన్న మానసిక రోగులకు అల్పాహారం అందిస్తుంటారు. వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ, ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు.



అల్పాహారం అందజేస్తున్న శ్రీహరి



విద్యుత్తు అంతరాయంతో చరవాణి వెలుగులో పత్రాల పరిశీలన

ఉపాధి పనుల్లో అవకతవకలు

గుడ్లూరు: మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. బుధవారం గుడ్లూరులో సామాజిక తనిఖీ ప్రజావేదికను డ్వామా పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో మొత్తం రూ.20,24,36,444 విలువైన పనులు జరిగాయి. పనుల కొలతల్లో అవకతవకలు పాల్పడి కూలీల సహాయకులకు నగదు స్వాహా చేసినట్లు తేల్చారు. స్వర్ణాజీపురం, గుడ్లూరులో ఎక్కువగా జాబ్‌కార్డులు లేకుండా చేపూరులో అధిక సంఖ్యలో కార్డులు ఉన్నట్లు గుర్తించారు. 24 పంచాయతీల్లో క్షేత్రసహాయకులు, టీఏ, ఏపీవోల నుంచి రూ.5,05,169 నగదు రికవరీకి ఆదేశించినట్లు పీడీ తెలిపారు. చేపూరులో రూ.2,25,942 అవకతవకలు జరిగినట్లు తేల్చారు. విజిలెన్సు అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీవోలు పాల్గొన్నారు.

14న మద్యం దుకాణాల డ్రా

నెల్లూరు(నేర విభాగం) : ఈ నెల 14న మద్యం దుకాణాలకు సంబంధించిన లక్కీ డ్రా కలెక్టర్ సమక్షంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎ.శ్రీనివాసులు నాయుడు బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 182 మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించామనీ, పదకొండో తేదీ రాత్రి 7 వరకు వాటిని స్వీకరిస్తామన్నారు. లక్కీ డ్రాలో ఎంపికైన దుకాణదారులు 16 నుంచి ప్రారంభించుకోవచ్చన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఉన్న యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపా ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సర్క్యులర్ 01/2019ను యథావిధిగా అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యంరాజు, చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శులు ఎం.డి.ప్రసాద్, జి.నారాయణరావు, కార్యదర్శులు ఇ.రమేశ్‌కుమార్, రాధాకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.యుగంధర్, ఓవీ ప్రసాద్, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, పక్కన ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య

భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: జిల్లాలో భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని సభ్యత్వ కార్యక్రమ ఏపీ సహఇన్‌ఛార్జి కృష్ణదాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలోని బీవీనగర్‌లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి.. పార్టీపై అవగాహన కలిగిస్తూ సభ్యత్వ నమోదు చేయించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేశ్, బీవీనగర్ అధ్యక్షుడు గుంజి శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కృష్ణదాస్, వంశీధర్ రెడ్డి తదితరులు



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో వంశీకృష్ణ

పక్కాగా ఈ క్రాప్ నమోదు: ఆర్డీవో

బిట్రగుంట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో పంటల నమోదు ప్రక్రియ పక్కాగా జరగాలని.. ఈ విషయాన్ని గుర్తించాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం బోగోలు మండలం నాగులవరం, చెంచులక్ష్మీపురంలో పంటలు నమోదు చేసిన భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట ఉత్పత్తులు అమ్ముకోవాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరని వివరించారు. ఆయన వెంట బోగోలు తహసీల్దారు సురేష్‌బాబు, వ్యవసాయశాఖాధికారిణి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

జాయింట్-I సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ప్రాంతీయ కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా ఐ.విజయరాణి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా ఆమెను ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు. ఇక్కడ ఇదే పోస్టులో పనిచేస్తున్న రాంబాబును ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. విజయరాణి గతంలో ఇదే కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. సబ్ రిజిస్ట్రార్‌కు సీనియర్ సహాయకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,241
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 57,928
వెండి గ్రాము :	రూ. 94.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

వెబెక్స్ వేదికగా.. పెన్షన్ అదాలత్ నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పెన్షనర్లు, సభ్యులకు ఈపీఎస్ 1995 నిబంధలను అర్థం చేసుకోవడానికి, తమ ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి ఒక ప్రత్యేక వేదిక అవసరమని.. ఇందుకోసం గురువారం ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని కడప రీజనల్ పీఎఫ్ కమిషనర్-2 మనోజ్ శంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, సమీప భవిష్యత్తులో(ముఖ్యంగా రాబోయే మూడు నెలల్లో) పెన్షనర్లు కాబోయే సభ్యులు కూడా తమ ఫిర్యాదులతో ఈ అదాలత్‌కు హాజరు కావాలన్నారు. వెబెక్స్ లింకు https:///meet309.webex.com/meet309/j.php?MTID=mffbe2747e8e2ce2572d28372c089be3f, మీటింగ్ నంబర్: 2641 534 9454, పాస్వర్డ్: 1234 ద్వారా కనెక్ట్ కావాలని సూచించారు.

సీఎంపై అసభ్యకర పోస్టులు కేసు నమోదు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో మండలంలోని తోటలపల్లెచెరువుకు చెందిన పిట్టల జయరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రఘునాథ్ తెలిపారు. ఇతను సీఎంపై ఇటీవల పోస్టులు పెట్టారు. వీటిని గుర్తించిన పార్టీ గ్రామ నాయకుడు జానీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. జయరాం గ్రామంలో ఉండడం లేదని.. దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

సెంట్రింగ్ కార్మికుడి దారుణ హత్య

మియాపూర్, న్యూస్‌టుడే: చందానగర్ ఠాణా పరిధిలో ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంట్లోనే మర్మాంగాల వద్ద కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. సీఐ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకనిపాడు గ్రామానికి చెందిన తన్నీరు మాల్యాద్రి(38) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి సెంట్రింగ్ పనులు చేస్తూ శేరిలింగంపల్లి తారానగర్‌లో ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు స్వగ్రామంలో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు గతనెల 30న వెళ్లగా.. మాల్యాద్రి ఒంటరిగానే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న ఆయన్ను గుర్తుతెలియని వ్యక్తులు కిరాతకంగా హత్యచేశారు. ఆయన ఇంటికి సమీపంలో ఉండే సోదరి కుమారుడు వచ్చి పిలిచినా మాల్యాద్రి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో తల్లికి సమాచారం ఇచ్చాడు. ఆమె మాల్యాద్రి సెల్‌ఫోన్‌కు సైతం కాల్ చేసినా స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా అప్పటికే హత్యకు గురైనట్లు సోదరితోపాటు స్థానికులు గుర్తించారు. హత్య జరిగిన ఆయన ఇంట్లో సంఘటన ప్రాంతంలో మద్యం బాటిళ్లు ఉండడంతో ఎవరైనా స్నేహితులతో కలిసి మద్యం తాగిన సందర్భంలో గొడవ జరిగి హత్యకు పాల్పడ్డారా? మరేమైనా ఇతర కారణాలున్నాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని చందానగర్ సీఐ పాలవెల్లి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెనుకబడితే చర్యలు తప్పవు : డీఈవో

కావలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల అమలులో వెనుకబడిన ఎంఈవోలపై చర్యలు తప్పవని డీఈవో పీవీజే రామారావు హెచ్చరించారు. బుధవారం కావలి, కందుకూరు డివిజన్లలోని ఎంఈవోలు, క్లస్టర్ రిసోర్సు పర్సన్లతో పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులను తిరిగి చేర్పించడంలో ఏఎస్‌పేట, చేజర్ల మండలాలు ముందున్నాయని అక్కడి అధికారులను ప్రశంసించారు. నెల్లూరు, కావలి డివిజన్లు చాలా వెనుకబాటులో ఉన్నాయన్నారు. మన బడి- మన భవిష్యత్తు పథకంలోనూ వెనుకబడ్డారని మందలించారు. ఉపాధ్యాయుల ముఖ హాజరులో జిల్లా చాలా వెనుకబడిందన్నారు. ఉదయం తొమ్మిదిగంటలకు చేయాల్సి ఉంటే అరగంట అంతకు మించి ఆలస్యమవుతుండడం దారుణమన్నారు. అదేమింటే సిగ్నల్స్ లేవని కుంటిసాకులు చెబుతున్నారన్నారు. అటవీ ప్రాంతం అధికంగా ఉండే అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యాయులు ముందంజలో ఉంటున్నారన్నారు. జిల్లాలో 38 మంది ఎంఈవోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రూ.లక్షల్లో జీతం తీసుకుంటున్నప్పుడు బాధ్యతగా పనిచేయాలన్నారు. లేకుంటే మీకిచ్చే జీతాలు వృథా అన్నారు. మీ పిల్లల్లో ఎంతమంది ప్రభుత్వ పాఠశాలలకు వెళుతున్నారని అడగ్గా ఆరేడుగురు చేతులెత్తడంపై విస్మయం చెందారు. ఎవరికి వారు విధుల్లో అంకితభావంతో పనిచేయాలని స్పష్టంచేశారు.

యువత.. క్రీడా ఘనత





వాలీబాల్, చదరంగం ఆటల్లో రాణిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

● పేరు ● చదువు ● ఊరు ● సాధించిన పతకాలు ● లక్ష్యం

న్యూస్‌టుడే, కోవూరు

వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులు.. ఉన్న వసతులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మెరుగ్గా రాణిస్తున్నారు.. చదువుతో పాటు బరిలో దిగిన ప్రతి పోటీల్లో సత్తాచాటుతున్నారు... ఇంటర్ దాకా వారికి సరియైన ప్రోత్సాహం లేక ప్రతిభ వెలుగులోకి రాలేదు.. గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో పీడీ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.. కేవలం తరగతి గదులకు పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు. బీటెక్ చదువుతూ క్రీడల్లో రాణిస్తున్న పలువురు విద్యార్థులపై ప్రత్యేక కథనం.

బరిలో దిగితే పతకమే



● పి.వెంకటేశ్వర్లు
● బీటెక్ (సీఎస్సీ మూడో ఏడాది)
● నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేట
● కావలి విశ్వోదయ కళాశాలలో గత నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు.
● అంతర్జాతీయ స్థాయిలో ఆడటం

జోనల్ స్థాయిలో ప్రతిభ



● బి.రాగవర్షిణి
● బీటెక్ (సీఎస్సీ ద్వితీయ ఏడాది)
● నెల్లూరు.
● కోవూరు, బుచ్చి, ఆత్మకూరు, నెల్లూరులో జరిగిన వివిధ జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. గత నెలలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.
● ప్రభుత్వ కొలువు సాధించడం

అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



● సీహెచ్ శివశంకర్
● బీటెక్ (ఈఈఈ నాలుగో ఏడాది)
● నెల్లూరు
● రాష్ట్రస్థాయిలో జరిగిన చదరంగం పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు దక్కించుకున్నారు. గత నెలలో కావలి విశ్వోదయలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు.
● అంతర్జాతీయ స్థాయిలో ఆడటం

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

నేడు డయల్ యువర్ కావలి డీఎం

కావలి, న్యూస్‌టుడే: ప్రయాణికుల సమస్యలు తెలుసుకొనేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాఘురు శ్రీనివాసులు బుధవారం ప్రకటించారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో 99592 25643 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలపాలన్నారు. కావలి పట్టణం, మండలం, జలదంకి, బోగోలు, కొండాపురం, దగదర్తి ప్రాంతాల వారు ఫోన్ చేయవచ్చన్నారు.

ఉదయగిరిలో: పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అందిస్తున్న సేవలు, బస్సుల్లో ఏమైనా ఇబ్బందులుంటే, 99592 25095 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

కుమ్మక్కు లేదు.. అంతా పోటీనే: ఏసీ

కావలి: మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయకుండా అడ్డుకుంటున్నారనే మాటల్లో వాస్తవం లేదని ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ దయాసాగర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలి స్టేషన్ పరిధిలో 17 దుకాణాలకు 170 దరఖాస్తులు వచ్చాయన్నారు. లింగసముద్రంలో రెండింటికి 65 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో దుకాణదారులకు 12 శాతం మాత్రమే కమీషన్ ఉండేదన్నారు. ఇప్పుడు 20 శాతానికి పెంచిందన్నారు.

సమస్య: దగదర్తి పరిధిలోని పాతూరులో తాగునీరు సక్రమంగా అందడం లేదు. నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. - **అంకయ్య, దగదర్తి**

సమాధానం : పరిశీలించి లోపాలు సరిచేస్తాం. సక్రమంగా సరఫరా చేస్తాం. - **వెంకటేశ్వర్లు, ఎంపీడీవో** - **న్యూస్‌టుడే, దగదర్తి**

? మాప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. -**ఈశ్వరయ్య, ఉత్తర జనతాపేట**

✓ పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. - **శ్రీనివాసులు రెడ్డి, సహాయ ఇంజినీర్, కావలి - న్యూస్‌టుడే, కావలి**

? మండలంలోని కృష్ణారెడ్డిపాలెంలో అంతర్గత రహదారులు దారుణంగా ఉన్నాయి. కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటిని కొనుగోలు చేసి తాగుతున్నాం. - **వెంకటేశ్వర్లు**

✓ పంచాయతీ పాలకవర్గంతో మాట్లాడి నిధుల లభ్యతను చూసుకుని ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తాం. - **ప్రత్యూష, ఎంపీడీవో** - **న్యూస్‌టుడే, కలిగిరి**

? గ్రామంలోని పఠాన్ వీధిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అంధకారంతో రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంటోంది. వృద్ధులు, పిల్లలు గాయపడుతున్నారు. - **భాదర్, ఉలవపాడు**

✓ పరిశీలించి రెండు రోజుల్లో వెలిగించే ఏర్పాటు చేయిస్తాం. - **వీరయ్య, పంచాయతీ కార్యదర్శి** -**న్యూస్‌టుడే, ఉలవపాడు**

జననీ.. జయశుభకారిణి





ఉలవపాడు, కావలి, వింజమూరులో సరస్వతి అలంకారంలో అమ్మవారు




ఉదయగిరి: శివాలయంలో పార్వతీదేవి . వరికుంటపాడు: నాగాలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతున్నాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో బుధవారం భక్తులు పోటెత్తారు. సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మ వారిని దర్శించుకొని పూజలు చేశారు.

కొందరి స్వార్థం.. పురానికి భారం

న్యూస్‌టుడే, కావలి



ఇది కావలి పట్టణంలోని ట్రంకురోడ్డు అంచున మురుగు కాలువల్లో సాగుతున్న పూడికతీత ప్రక్రియ. దుకాణాల ముందు పటిష్టంగా నిర్మించిన కాలువ పైకప్పులను కష్టపడి కార్మికులు తొలగిస్తున్నారు. ఈ పనిని పురపాలక సంఘం ఏటా గుత్తేదారులకు అప్పగిస్తోంది. ఇందుకు ప్రస్తుత సంవత్సరం రూ.70 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు.

పురపాలక పరిధిలో కాలువల్లో పూడిక తీత వ్యవహారం ఏటా ఓ ప్రహసనంగా మారుతోంది. రెండు నెలల పాటు గుత్తేదారులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భారీగా వ్యయం చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఆర్థిక భారం మాత్రం పుర ప్రజలపైనే పడుతోంది. అయినా దుకాణదారులు ఇవేమీ లెక్క చేయడం లేదు. ప్రస్తుతం కావలి ఆర్‌.ఆర్ అతిథి గృహం వద్ద భారీ వాణిజ్య సముదాయం ముందు పూడిక తీయడం లేదు. ఇలా చాలా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఒక్కో వరద కాలువలోను కిలోమీటర్ల పరిధిలో సాగుతోంది. నిర్మాణాలు జరిగేటప్పుడే పట్టణ ప్రణాళికా విభాగం పక్కా ప్రణాళికతో పర్యవేక్షిస్తే ఇలాంటి ఇబ్బందులకు తావుండదు.

ఇది ట్రంకురోడ్డు అంచున కాలువపై పటిష్టంగా దుకాణం ముందు ఏర్పాటుచేసిన శ్లాబ్. దీనిని తొలగించడం మావల్ల కాదని శ్రామికులు చేతులెత్తేశారు. అక్కడ పూడిక పేరుకుపోయింది.



ఇబ్బందులు వాస్తవమే

శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి

పూడికతీత వ్యవహారం చాలా క్లిష్టంగా మారిన మాట వాస్తవమే. దుకాణదారులు అర్థం చేసుకోవాలి. ధ్వంసం చేస్తున్నా, తిరిగి అడ్డగోలుగా నిర్మిస్తున్నారు. పురపాలక సంఘాన్ని ఇబ్బంది పెట్టడం తగదు.

కొండాపురం రోడ్డు ఇలా..

మండల కేంద్రమైన కలిగిరిలోని కొండాపురం రోడ్డు గోతులతో దారుణంగా తయారైంది. కొద్దిపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూడడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను వివరణ కోరగా ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. - **న్యూస్‌టుడే, కలిగిరి**



గొంతు తడుపుకోవాలని..

ఈ చిత్రం పట్టణంలోని రూపాయి మిద్దె కూడలి సమీపంలోని ఓ సంపులో వృథాగా పోతున్న నీరు. నీటి సరఫరాలో అటంకాలు తొలగించేందుకు స్పర్ టవర్ విధానంలో కొంత వదిలేస్తుంటారు. దీన్ని ఆ దారిన పోయే వాహన చోదకుడు సీసాతో పట్టుకుంటున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. ఈ విషయమై పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ ఇది అనివార్యమన్నారు. - **న్యూస్‌టుడే, కావలి**



కుండపోత వర్షం

పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కుండ పోత వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో రోడ్లు నీటితో నిండిపోయాయి. పంచాయతీ బస్టాండ్‌లో భారీగా నీరు చేరింది. - **న్యూస్‌టుడే, ఉదయగిరి**



మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

లింగసముద్రం, న్యూస్‌టుడే: అన్నేబోయినపల్లి సమీపంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహమ్మద్ సుభానీ చెప్పారు. డ్రైవర్లు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన పొట్టేళ్ల వేలం

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని చింతలదేవి క్షేత్రంలో పశుగణాభివృద్ధి కేంద్రంలో బుధవారం అధికారులు పొట్టేళ్ల వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో 177 పొట్టేళ్లను కొనుగోలుకు ఉంచగా 75 పొట్టేళ్లను వేలంలో రైతులు దక్కించుకున్నారు. రూ. 7,84,120 నగదు జమ అయినట్లు జేడీ రమేష్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో డీడీ పెద్ద స్వామి, ఏడీలు పాల్గొన్నారు.

పోర్టు వద్ద రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి

కందుకూరు పట్టణం : భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ రిఫైనరీని రామాయపట్నం పోర్టు వద్ద ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత వాసులు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. రిఫైనరీ ఏర్పాటుకు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

కందుకూరు గ్రామీణం : పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో రత్నజ్యోతి సూచించారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

విగ్రహాల ధ్వంసం తగదు: మేకపాటి

వరికుంటపాడు : విగ్రహాలను ధ్వంసం చేయడం తగదని వైకాపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని తొడుగుపల్లెలో ఇటీవల వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు.

సంక్షిప్త సమాచారం

దీనిపై బుధవారం ఆ పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన కేసులో తొలుచెదవపల్లి గ్రామానికి చెందిన ఆలిల శేషుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రఘునాథ్ తెలిపారు.

హుండీ ఆదాయం రూ.19.48లక్షలు

లింగసముద్రం : మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆరు నెలల.. హుండీ కానుకలను లెక్కించగా రూ. 19.48లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. కందుకూరు డివిజన్ దేవాదాయశాఖ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వలేటివారిపాలెం : పంటల సాగు సమయంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించగలుగుతారని సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అనసూయ అన్నారు. గురువారం పోకూరు రైతు సేవా కేంద్రంలో ఏవో హేమంత్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి : ఉదయగిరి : పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి శాఖ ఆధికారులు ఆంజనేయులునాయక్, జయశ్రీ పేర్కొన్నారు. బండగానిపల్లి, జి.చెరువుపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు, వరి పంటలు పరిశీలించి సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను వివరించారు.

సామూహిక అక్షరాభ్యాసం : ఉలవపాడు : మండలంలోని కరేడు రాజరాజేశ్వర్ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. గ్రామంలోని 60 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు.

నేరాలపై అప్రమత్తం : కందుకూరు పట్టణం : ప్రజలు నేరాల పట్ల అవగాహన చేసుకుని అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానికులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

జలదంకి: కావలి కాలువ చివరి వరకు పూడిక తీసి చెరువులకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావి మాల్యాద్రి కోరారు. బుధవారం మండల రైతు సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ ఎం.ప్రమీలకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గడ్డం మాల్యాద్రి, సీపీఎం మండల కార్యదర్శి ఎం.ఆంతోనీబాబు పాల్గొన్నారు.

రాయపేటలో ఎడ్ల పందేలు

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని రాయపేటలో బుధవారం ఎడ్ల పందేలు కోలాహలంగా జరిగాయి. ఉపాధి హామీ పథకం విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు కట్టేపల్లి భవాని వీటిని ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎడ్లు వచ్చాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పప్పు సుదర్, నారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకారం

జలదంకి, న్యూస్‌టుడే : బాపట్ల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చిన ఎం.ప్రమీల బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను రెవెన్యూ అధికారుల సాయంతో క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి అభినందించారు.

ఎస్సైగా వెంకట్రావు



కొండాపురం: నెల్లూరు 5వ టౌన్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎం. వెంకట్రావు బుధవారం మండలంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఉన్న బి.మహేంద్రను నెల్లూరు వీఆర్‌కు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

వత్సవాయి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కావలికి చెందిన ఎం.చంద్, సి.ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలిసి బాతుల పెంపకం నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా లింగాల వద్ద ఉంటున్నారు. బుధవారం రాత్రి చంద్, ప్రవీణ్ ద్విచక్రవాహనంపై లింగాల నుంచి పెనుగంచిప్రోలు వస్తుండగా మక్కపేట వద్ద రహదారిపై గుంతను తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వారిని 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులు వచ్చి క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

డీసీఎమ్మెస్ మాజీ డైరెక్టర్‌పై దాడి



మల్లికార్జుననాయుడు

కావలి : జిల్లా సహకార శాఖ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్)మాజీ డైరెక్టర్ దామిశెట్టి మల్లికార్జుననాయుడిపై బుధవారం దాడి జరిగింది. మధ్యాహ్నం కావలిలోని వేపనూనె మిల్లు పైఅంతస్తులో ఉండగా పది మంది అగంతుకులు వచ్చి దాడికి పాల్పడ్డారు. ఆయన కేకలు వేయడంతో స్పందించారు. మిల్లు సిబ్బంది, దారిన పోయే వారు కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. తెదేపా నాయకుడు దేవరకొండ శ్రీను నేతృత్వంలోనే యువకులు తనపై దాడి చేశారని తెలిపారు. జిల్లా సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, నాయకులు శ్రీనివాసులునాయుడు, తదితరులు పరామర్శించారు. దాడిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఖండించారు. కావలి ఒకటో పట్టణ పోలీసులు విచారిస్తున్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

పొదలకూరు, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చి, కొడవలూరు, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వమందించే అనేక సంక్షేమ, రాయితీ పథకాలు అందిస్తోందని వాటిని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని రామతీర్థం, గాదెలదిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరులో అధికారులు వేరుసెనగ, తెగుళ్లు, ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. కొడవలూరు మండలంలోని రేగడిచెలిక, నాయుడుపాళెంలో ఎంఏవో సీహెచ్ఎస్ లక్ష్మీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పురందరపురం, మునులపూడి గ్రామాల్లో ఏవో సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. పొదలకూరు ఏడీఏ శివనాయక్ మొగుళ్లూరు, ఆర్.వై.పాళెంలో అవగాహన కల్పించారు.

పాల సేకరణలో ఆదర్శం

అన్నారెడ్డిపాళెం (సంగం), న్యూస్‌టుడే: పాల సేకరణలో అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం రైతులు ఆదర్శంగా నిలిచారని విజయ డెయిరీ ఎండీ జి.కృష్ణ మోహనరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు బహుమతులు అందజేశారు. విజయ డెయిరీ ఇటీవలే లాభాల బాట పట్టిందన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు.

బాధ్యతల స్వీకరణ

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు మండల ఎంపీడీవోగా చిలకల శ్రీహరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో సిబ్బంది ఆయన్ను సన్మానించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో శ్రీహరి బుచ్చిరెడ్డిపాళెం మండలానికి బదిలీ అయ్యారు.

టోకెన్ కడదాం.. ఇసుక తరలించేద్దాం..!

న్యూస్‌టుడే, బుచ్చి రూరల్

టోకెన్ కడదాం.. ఇసుక దోచేద్దామంటూ.. అక్రమార్కులు.. సంగం నుంచి బుచ్చిలోని పలు ప్రాంతాలకు ఇసుక తరలిపోతోంది... పెన్నానది తీర ప్రాంతంలోని గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. .. అర్ధరాత్రి 12 గంటల నుంచి వేకువజామున నాలుగు గంటల వరకు వాహనాల్లో తరలిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఇసుక మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు.. ప్రభుత్వ ఉత్తర్వులతో పాటు సదరు ప్రజాప్రతినిధి ఘాటుగా హెచ్చరించడంతో అక్రమార్కులు సంగంపై దృష్టిసారించారు. సమీప మండలం కావడం, రవాణాకు అనుకూలంగా ఉండటంతో వారు ఇసుక, మట్టిని వివిధ గ్రామాల నుంచి తరలిస్తున్నారు.

సంగం నుంచి బుచ్చికి వాహనాల్లో వెళుతున్నా పట్టించుకోని అధికారులు



సంగం పోలీసుస్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

ఒక్కో ట్రాక్టరుకు రూ.20 వేలు..

ఇసుక తరలించాలంటే నెలకు ట్రాక్టరుకు రూ.20 వేల వంతున మామూళ్లను అధికారులకు ఇచ్చి తరలిస్తున్నారు. ఇటీవల మండలంలో అక్రమ తరలింపునకు పాల్పడిన ట్రాక్టర్లను ఆత్మకూరు పోలీసులు పట్టుకోవడం చర్చనీయాంశమైంది. స్వయంగా డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించి మరొక ట్రాక్టరును పట్టించారు. ఇటీవల పలు ట్రాక్టర్లను సంగం పోలీసులు పట్టుకున్నా, వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఫిర్యాదు చేస్తేనే వాటిని అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిది గ్రామాల పరిధిలో..

సంగం మండలంలో వీర్లగుడిపాడు నుంచి అన్నారెడ్డిపాళెం వరకు పెన్నానది తీరం సుమారు 20 కి.మీ వరకు ఉంది. కోలగట్ల, సంగం, అనసూయనగర్, పడమటిపాళెం, వెంగారెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం, పల్లిపాళెం, మక్తాపురం గ్రామాల్లో నాణ్యమైన ఇసుకతో పాటు తువ్వ ఇసుక కూడా పుష్కలంగా లభిస్తుండటంతో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి 12 గంటల నుంచి వేకువ జామున నాలుగు గంటల వరకు ఇసుక అక్రమంగా తరలిపోతోంది.

చెర్లోవంగల్లులో మట్టి..

చెర్లోవంగల్లులో దువ్వూరు చెరువు నుంచి నల్లమట్టి భారీస్థాయిలో లభ్యమవుతుంది. ఇటీవల కాలంలో చెరువుకు నీరు రానందున అక్రమ తవ్వకాలకు అనుకూలంగా ఉండటంతో అక్కడి నుంచి మట్టిని బుచ్చిరెడ్డిపాళెంలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.

బుచ్చి టోల్ ప్లాజా వద్ద నిఘా పెడితే..

సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెంకు వెళుతున్న మట్టి, ఇసుకను అడ్డుకోవాలంటే రెండు మండలాల సరిహద్దులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద పోలీసులు గస్తీ ఏర్పాటు చేస్తే అక్రమ తరలింపును అడ్డుకునే అవకాశముందని పలువురు చెబుతున్నారు. సంగం సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ.. ఇసుక, మట్టి అక్రమ తరలింపును అడ్డుకుంటున్నామని, ఇప్పటికే పలు కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. టోల్‌ప్లాజా వద్ద గస్తీ నిర్వహించాలంటే, అది బుచ్చి పరిధిలో ఉందన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ శిబిరం

కోవూరు, న్యూస్‌టుడే: తపాలా వారోత్సవాల సందర్భంగా కోవూరు పట్టణంలోని శాంతినగర్ రెండో వీధిలోని తపాలా కార్యాలయంలో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు పోస్టు మాస్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆధార్ కార్డులో పేర్లు, వయసు, జన్మదిన తేదీల మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి అనుమతించాలి

సంగం, న్యూస్‌టుడే: దువ్వూరులో పొద్దుపొదుపు కాలువ సమీపంలో వ్యవసాయం చేసుకుంటున్న తమ పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు బుధవారం తహసీల్దార్ సోమ్లానాయక్ దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ కల్వర్టును స్వయంగా తామే నిర్మించుకునేందుకు అనుమతించాలని వినతి పత్రం ఇచ్చారు. జలవనరుల శాఖ అధికారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలం పీపీపల్లి బీసీ కాలనీలో తాగునీటి పైపులు పగలడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. – సురేష్, స్థానికుడు

? పీపీపల్లిలో రోడ్డు మధ్యలో వర్షపు నీరు నిలిచి పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – కొండారెడ్డి, స్థానికుడు

సమాధానం: పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తాం. – మహేష్, పంచాయతీ కార్యదర్శి

? మనుబోలులోని కోదండరామపురంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. –ప్రసాద్, స్థానికుడు

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. – గురుడయ్య, పంచాయతీ కార్యదర్శి

కామాక్షితాయి సేవలో దినేశ్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయిని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కోవూరులో గ్రామదేవత నాగావరపమ్మ ఆలయంలో, విడవలూరులోని పీర్లచావిడి సెంటర్‌లో ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



విడవలూరులో పూజలు చేస్తున్న పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి

రీసర్వేకు సిద్ధం కావాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు డివిజన్‌లో రీసర్వేకు సిద్ధం కావాలని ఆర్డీవో పావని అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సర్వే అధికారులతో మాట్లాడారు. భూముల కొలతల్లో వివాదం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రికార్డులు సేకరణ తదితరాలపై చర్చించారు. రైతులను ముందుగానే చైతన్యవంతం చేయాలని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

విడవలూరు: మండలంలోని అన్నారెడ్డిపాలెంలో బుధవారం అంకాళమ్మ, పరమేశ్వరి, పోతురాజు పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. కలశ స్థాపన, కుంభాభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



పొదలకూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామ ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్తు స్తంభాలకు మొక్కలు తీగలు అల్లుకున్నాయి. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. ఎవరైనా పిచ్చి మొక్కలు తొలగించేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తే ప్రాణం మీదకు తెచ్చుకోవాల్సి వస్తోందని భయపడుతున్నారు. డిస్కం ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ.. సిబ్బందికి చెప్పి పిచ్చి మొక్కలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు, ముత్తుకూరు

జాతీయ రహదారి చెత్తమయం



నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలం జాతీయ రహదారిపై చెత్త వేయడంతో దుర్గంధం వస్తోంది. కసుమూరు రోడ్డు వద్ద కొన్ని రోజులుగా చెత్త పేరుకు పోయింది. ద్విచక్ర వాహన దారులు రాత్రి వేళల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో వాటిని ఢీకొని గాయపడుతున్నారు. మండల, స్థానిక అధికారులు నిత్యం ఈ మార్గంలో చూస్తూ వెళ్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ.. రహదారిపై చెత్తగుట్టను తొలగించి మరలా వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

పొదలకూరులో రాయితీ టమాట విక్రయాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు పొదలకూరు రైతు బజారులో బుధవారం రాయితీ టమాట విక్రయాలు ప్రారంభమయ్యాయి. బయట మార్కెట్లో రూ.80 ధర ఉండగా మార్కెటింగ్ శాఖ రైతు బజారు ద్వారా కిలో రూ.50కే విక్రయిస్తున్నారు. పర్యవేక్షకులు ప్రవీణ్ మాట్లాడుతూ ఆధార్ లేదా రేషన్ కార్డులు ఉన్న వారికి రెండు కిలోల వంతున అందిస్తున్నామన్నారు. 60 కిలోల వరకు విక్రయించినట్లు తెలిపారు. డిమాండుకనుగుణంగా పంపిస్తున్నారని చెప్పారు. చిన్నవిగా ఉండటంతో వినియోగదారులు పెద్దగా కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

అయ్యప్ప భక్తులకు అన్నదానం

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరు మండలంలోని అయ్యప్పస్వామి, శివ, దుర్గా, విఘ్నేశ్వర మాలధారణ భక్తులకు ప్రతి రోజూ మధ్యాహ్నం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అయ్యప్పస్వామి భక్తులు జయమూర్తిరెడ్డి, మొలబంటి రాము తెలిపారు. బుధవారం నుంచి నవంబరు ఒకటి వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు ఉంటుందన్నారు. మండలంలోని మాలధారణ చేసిన భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శివాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

In The Court of The Senior Civil Judge, Kovur

I.P. No.10/2024

Mylavaram Peddanancharulu - Petitioner(Debtor)

Vs

1.Ramisetty Sudhakar
2. Ramisetty Satish
3. Manam Babu Rao
4. Thalla Seetharamamma
5. Madapaka Varalakshmi
6. Tadisetty Sudhakar
7. Bynaboina Venkateswarlu
8. Ramisetty Lakshmaiah
9. Kandukuru Ramesh
10. Kovuru Venkata Subbaiah
11. Kovuru Mallikharjuna
12. Pakam Penchalamma
13. Kona Rathamma
14. Podamekala Lakshmi
15. Manam Nagaiah
16. Bochu Mallikharjuna
17. C.Anvesh
18. Pinniboina Hazarathaiah
19. Vegu Penchala Narasimha Murthy
20. Veguru Anuradha
21. Ramisetty Vasu
22. Todati Jayaramaiah
23. Kotla Narayana
24. Katla Bhuvaneswaramma
25. Makthala Hemanth Rao
26. Karna Tharakeswara Rao
27. Shaik Dorababu
28. Kovuru Rajamma
29. Baddepudi Balaiah
30. Inukonda Kechari
31. Podili Uma Maheswari
32. Mallu Gowthama Reddy
33. Marella Harshavardhan Naidu
34. Ummdipingu Radhika
35. Manchukonta Sudhakar Rao
36. Lingamgunta Naresh
37. Yekollu Bhavani
38. Addanki Suresh
39. Kambala Hemantha Raj
40. Goggada Chinna Babu
41. Bellamkonda Uma Maheswara rao
42. Basava Mallikharjuna
43. Morla Rajesh

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో I.P.No. 10/2024 పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల తేది 22–10–2024న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది.

కాకుటూరు రమేష్‌రెడ్డి, B.Com., B.L.,
దుగ్గులూరు సురేష్‌రామ్, MBA., LLM
అడ్వకేట్స్, నెల్లూరు. Cell: 99598 70187

టిడ్కో ఛైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

అనుమసముద్రంపేట, మనుబోలు న్యూస్‌టుడే: టిడ్కో ఛైర్మన్, జనసేన పార్టీ జాతీయమీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్‌ను బుధవారం ఏఎస్‌పేట జనసేన మండల కన్వీనర్ సయ్యద్ అక్బర్‌బాషా నెల్లూరులో కలిశారు. నెల్లూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన్ను మనుబోలు మండల జనసేన నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు పెనుబాక ప్రసాద్, బోనుబోయిన ప్రసాద్‌యాదవ్, జాకీర్, ఖాదర్‌వలి, పవన్, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో చెట్టు దగ్ధం



మర్రిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఏపిలగుంటలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఆ సమయంలో ఊరి మధ్యలోని టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. మంటలు చేలరేగడంతో పిడుగు దగ్ధమైంది. ఆ సమయంలో అక్కడ జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గత 30 ఏళ్లలో పిడుగు పడటం ఇదే తొలిసారి అని గ్రామస్థులు తెలిపారు.

చదువులతల్లి.. సదాస్మరామి

విడవలూరు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చి, కోవూరు, మనుబోలు, సైదాపురం, కలువాయి, ఆత్మకూరు, సంగం, న్యూస్‌టుడే: కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విడవలూరులో గాయత్రిదేవి అలంకరణలో అంకమ్మతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. పొదలకూరులోని చౌడేశ్వరి దేవి ఆలయంలో కుంకుమపూజలు నిర్వహించారు. జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో, మనుబోలు దసరా చావిడి వద్ద, దేవాంగులవీధిలో కొలువుదీరిన పోలేరమ్మ ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. సైదాపురంలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో బుధవారం సరస్వతీదేవి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీదేవి అలంకరణలో శ్రీకలువాయమ్మ దర్శనమిచ్చింది. కోవూరులోని పట్టణంలోని గ్రామదేవత నాగావరపమ్మ అమ్మవార్లు గురువారం సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. బుచ్చి కోదండరామస్వామి ఆలయంలో స్వామి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, అనంతసాగరంలో పూజలు చేశారు.



పొదలకూరులో అమ్మవారి పూజలో భక్తులు



పెంచలకోనలో హాజరైన భక్తులు



విడవలూరులో..



ఆత్మకూరులో..



మనుబోలులో..



జొన్నవాడలో..

నాసిరకంగా రోడ్డు పనులు

కొడవలూరు, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తరచూ ప్రమదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డు వేస్తే జాతీయ రహదారి నుంచి అల్లూరు రోడ్డుకు సులువుగా నార్తురాజుపాళెం, కొడవలూరుకు వెళ్లకుండా ఈ మార్గంలో వెళ్లేందుకు ఉపయోగపడుతుందని ప్రజలు భావించారు. తీరా రోడ్డు పనులు చేస్తున్న వారు కనీస నిబంధనలు పాటించడం లేదు. కొడవలూరు మండలంలోని తలమంచి పంచాయతీలో నాణ్యతకు తిలోదకాలిచ్చి తారు రోడ్డు పనులు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తలమంచిలోని బొడ్డువారిపాళెం నుంచి అల్లూరు రోడ్డు వరకు చేస్తున్న పనులు అత్యంత నాసిరకంగా ఉన్నాయని, గ్రావెల్ తోలి నామమాత్రంగా రోడ్డు నిర్మాణపనులు చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ మాట్లాడుతూ రోడ్డుపనులు అత్యంత నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. అధికారులు పరిశీలించి నాణ్యతగా రోడ్డు వేయించాలని కోరారు. సంబంధిత అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



నిర్మాణానికి వినియోగిస్తున్న కంకర

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై కలెక్టరుకు ఫిర్యాదు చేశానని అక్బర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సహకార సంఘం ట్రాక్టరుకు వచ్చే అద్దె, ఇతర నిధుల లావాదేవీలు సరిగా లేవని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ఆత్మకూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిలానీ తెలిపారు. మండలంని దేపూరు సమీపంలో బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు వివరించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవూరులో విషాదం చోటుచేసుకుంది. నవరాత్రుల సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు అలంకరణ స్తంభాన్ని తగలడంతో విద్యుదాఘాతానికి గురై తక్కెలపాటి **నవీన్ కుమార్(26)** అనే యువకుడు బుధవారం మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు నవీన్ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. బుధవారం రాత్రి నవీన్ స్థానిక యువకులతో ఆటలాడుకుంటుండగా ప్రమాదవశాత్తు అమ్మవారి మండపం వద్ద విద్యుత్తు స్తంభాన్ని తాకారు. విద్యుదాఘాతంతో కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతిపై కేసు నమోదు చేశారు. మృతుడి తండ్రి తక్కెలపాటి గురవయ్య అయిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి ధనమ్మ, చెల్లెలు ఉన్నారు.

పంటను ధ్వంసం చేశారని ఫిర్యాదు

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండలం నల్లపాళెం గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి భూమిని రాము అనే వ్యక్తికి కౌలుకిచ్చారు. సాగులో ఉన్న పంటను శ్రీనివాసులురెడ్డి, దయాకర్‌రెడ్డి మరి కొందరు కలిసి దౌర్జన్యంగా పైపులైను వేసి పొలాన్ని ధ్వంసం చేశారని కౌలు రైతు రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై హనీఫ్ తెలిపారు.

రెండు టిప్పర్లు సీజ్

బద్వేలు, న్యూస్‌టుడే : ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు గ్రామీణ సీఐ నాగభూషణం తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కలువాయికి చెందిన రెండు టిప్పర్లను పీపీకుంట తనిఖీ కేంద్రం వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

మనుబోలు, విడవలూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మనుబోలు ఎంపీపీ వజ్రమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విడవలూరులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ యజ్దాని బాషా పంచాయతీ ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆలయ భూములకు కౌలు వేలం

పొదలకూరు: పొదలకూరు మండలం వావింటపర్తిలోని చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు కౌలు వేలం బుధవారం నిర్వహించినట్లు ఈవో ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 3.80 ఎకరాల మెట్ట భూములకు ఎకరానికి రూ.4000, 1.80 ఎకరాల మాగాణికి రూ.17000 చొప్పున పొదలకూరు శివాలయంలో నిర్వహించగా కౌలు రైతులు దక్కించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటాచలం: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సురేశ్ తెలిపారు. కసుమూరు పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నాయకుల పరామర్శ

కోవూరు: గంగవరం సర్పంచి లక్ష్మీకుమారి భర్త తిరుపతిరెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందారని వైకాపా నాయకులు తెలిపారు. పలువురు నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. కటుంబ సభ్యులను పరామర్శించారు.

మంత్రిని కలిసిన మాజీ ఎంపీపీ

విడవలూరు: బీసీ సంక్షేమశాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య, విడవలూరు మండల మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు ఆయన ఛాంబర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

కరాటేలో చిచ్చర పిడుగులు



బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో పావని నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న విజ్ఞేష్, తనూజ

న్యూస్‌టుడే, ఆత్మకూరు, అనంతసాగరం

ఆ విద్యార్థులు కరాటేలో చిచ్చర పిడుగుల్లా.. దూసుకుపోతున్నారు. పోటీ ఎక్కడ జరిగిన పతకాలు సాధిస్తున్నారు. తమ ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విజ్ఞేష్. అనంతసాగరం మండలం కచెరిదేవరాయపల్లికు చెందిన తనూజలు. ఈ నెలలో అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు.

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం: విజ్ఞేష్

సారా యమునారాణి(లేట్), వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు విజ్ఞేష్.. మూడో తరగతి నుంచే కరాటేలో శిక్షణ తీసుకున్నారు. గతంలో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో, హరియాణాలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. రెజ్లింగ్‌లో.. జాతీయస్థాయిలో పతకాలు సాధించారు.

మరింత గుర్తింపు తెచ్చుకుంటా: తనూజ

అనంతసాగరం మండలం కచెరిదేవరాయపల్లికి చెందిన బండి రామయ్య, వెంకటరమణమ్మ దంపతులు కుమార్తె తనూజ ప్రస్తుతం ఏడో తరగతి చదువుతోంది. ఇప్పటికే మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. తాజా గెలుపుతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆనందం వ్యక్తం చేస్తుంది. భవిష్యత్తులో మరింతగా కష్టపడి గుర్తింపు తెచ్చుకుంటానని చెబుతోంది.

నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

తెలుగు తమ్ముళ్ల సంక్షేమానికి రూ.10కోట్లు

మంత్రి నారాయణకు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: తెలుగు తమ్ముళ్ల సంక్షేమానికి మంత్రి నారాయణ రూ.10కోట్లు కేటాయించడంతో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని జేమ్స్‌గార్డెన్ ప్రాంతంలోని ఆయన కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు సుజాత, అస్మా మొహినుద్దీన్, గోగుల నాగరాజు పాల్గొన్నారు.

మాదిగలు ఉద్యమించక ముందే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం దారుణమని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ అన్నారు. నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో బుధవారం మాదిగల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతే ఉద్యోగ ప్రకటనలు వేయాలని కోరారు. జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శేఖర్, నాయకులు జనార్దన్, కృష్ణయ్య, పోలయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదిగ జేఏసీ నాయకులు

తిరువనంతపురంలో కమిషనర్ సూర్యతేజ



కంపోస్టు యార్డు నిర్వహణను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఇతర రాష్ట్రాల్లో సమర్థంగా నిర్వహిస్తున్న మెరుగైన పురపాలక సేవలను అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషనర్ల బృందంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.సూర్యతేజ ఉన్నారు. కేరళలోని తిరువనంతపురం కార్పొరేషన్‌ను బుధవారం ఈ బృందం సందర్శించింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటరును ఆయన సందర్శించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బంది తోపాటు చెత్త సేకరణ, తరలింపు, వేరు చేయుట, కంపోస్ట్ యార్డ్ నిర్వహణ పనులను పరిశీలించారు. తిరువనంతపురం కార్పొరేషన్ వినియోగిస్తున్న తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, పౌరసేవల నిర్వహణతోపాటు పన్నుల వసూలు విధానాలను అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

మార్కెట్‌లో మోసం

కిలో కూరగాయలకు వంద గ్రాముల తక్కువ తూకం

✪ నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో మంగళవారం ఓ కొనుగోలుదారుడు కిలో టమాటాలు కొనుగోలు చేశారు. కొన్నప్పుడు తూకం 1100 గ్రాములకు పైగా చూపించింది. అనుమానం వచ్చి ధర్మకాటా వద్దకు వెళ్లి తూకం చూసుకుంటే 900 గ్రాములే చూపించింది.

✪ మిరపకాయలు, బెండకాయలు కొనుగోలు చేసిన మరికొందరు తూకం వేయగా వారికి రెండువందల గ్రాములు తేడా వచ్చింది.

✪ వీరిద్దరే కాదు.. ఇలాంటి వారు ప్రతి రోజూ వందలసంఖ్యలో మోసపోతున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో కొందరు దుకాణదారుల కారణంగా కొనుగోలుదారులు మోసపోతూ దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్ ఆవరణంలో సుమారు 150కు పైగా హోల్‌సేల్, రిటైల్ దుకాణాలున్నాయి. నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ఇక్కడకు కూరగాయల, ఆకుకూరలు కొనుగోలుకు వచ్చే వారితో కిటకిటలాడుతుంది. రోజు వారీ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతుంది. ఇక్కడ నిత్యం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపారులు సంపాదనే ధ్యేయంగా వినియోగదారులను మోసం చేస్తున్నారు. ప్రతి వస్తువులో తక్కువ తూకం వస్తోంది. తూనికలు కొలతల శాఖ అధికారులు ఏనాడు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. అందుకే వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తున్నారు.



ఏసీ కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన ధర్మకాటా

ధర్మకాటా ఏర్పాటు

కొనుగోలుదారులు దుకాణదారుల చేతిలో మోసపోకుండా నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధర్మకాటా ఏర్పాటు చేసింది. కొనుగోలుదారులు తాము కొన్న కూరగాయలను ధర్మకాటా వద్ద తూకం చూసుకోవచ్చు. ఈ విషయం చాలా మందికి తెలియదు. తెలిసిన వారు తూకం వేసుకుని మోసాలు పసిగడుతున్నారు. తిరిగి వ్యాపారుల వద్ద వెళ్లి మోసాన్ని తెలపగా తరుగు ఇస్తున్నారు. కొందరు సరిగా స్పందించడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, తూనికల శాఖ ఇక్కడ తూకాలను పరిశీలించి నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

● వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు మాట్లాడుతూ మోసాలు అరికట్టడంలో భాగంగా ధర్మకాటా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీసీ కులగణన, అభివృద్ధిపై అభిప్రాయ సేకరణ



అభిప్రాయాలు సేకరిస్తున్న బీసీ కార్పొరేషన్ అధికారిణి నిర్మలాదేవి

నెల్లూరు(విద్య): బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీసీ కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. నగరంలోని బీసీ స్టడీసర్కిల్‌లో బుధవారం బీసీ కులగణన, అభివృద్ధిపై బీసీ సంఘాల నాయకుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. నగరంలో బీసీ భవన్ ఏర్పాటు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కార్పొరేషన్ అధికారిణి నిర్మలాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారిణి ప్రసూన, బీసీ సంఘాల నాయకులు జనార్దన్‌రాజు, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య, రమేశ్, శాలివాహన, గౌడ, గాండ్ల సంఘ, వాల్మీకి సంఘ, ముదిరాజ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భాజపా విజయం.. కాంగ్రెస్‌కు గుణపాఠం



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు కె.రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్

నెల్లూరు (బృందావనం): హరియాణాలో భాజపా విజయం.. కాంగ్రెస్‌కు ఓ గుణపాఠమని కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నగరంలోని భాజపా జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు అడిగిన వెంటనే ప్రధాని మోదీ రాష్ట్రానికి రూ.15వేల కోట్లు మంజూరు చేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ సమావేశంలో భాజపా రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, వివిధ మోర్చాల నాయకులు గిరికుమార్‌గౌడ్, సాయిశ్రీనివాస్, జగన్ పాల్గొన్నారు.

పాల సేకరణలో ఆదర్శం

సంగం: పాల సేకరణలో అన్నారెడ్డిపాళెం విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం రైతులు ఆదర్శంగా నిలిచారని విజయ డెయిరీ ఎండీ జి.కృష్ణమోహనరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు బహుమతులు అందజేశారు. విజయ డెయిరీ ఇటీవలే లాభాల బాట పట్టిందన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం హాజరయ్యారు.

ఆర్నెల్లకే రహదారులు ధ్వంసం

నెల్లూరు నగరంలోని సిమెంటు రోడ్లను కేబుల్‌వైర్ల కోసం ధ్వంసం చేస్తున్నారు. ఆర్నెల్ల క్రితం నిర్మించిన రోడ్లను సైతం ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు 50ఏళ్లపాటు ఉపయోగపడాల్సి ఉండగా. . ఆర్నెల్లకే పనికిరాకుండా పోతున్నాయి. బృందావనంలో ఎన్నికలకు ముందు సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం దాన్ని తవ్వి కేబుల్ వైర్లు వేస్తున్నారు. మళ్లీ శిథిలాలతో కప్పేసి చేతులు దులుపుకొంటున్నారు. సిమెంటు రోడ్లకు మరమ్మతులు చేపడతామని నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



కుంగిన రోడ్డు



నగరంలోని గిడ్డంగి వీధిలో సిమెంటు రోడ్డు కుంగిపోయింది. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం కోసం రోడ్డును తవ్వారు. అనంతరం గుత్తేదారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారు. వర్షాలకు రోడ్డుకుంగిపోయి ప్రమాదకరంగా మారింది. అసలే ఇరుకు వీధి కావడంతో ద్విచక్రవాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

మురుగులోనే రాకపోకలు

ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జిలో ప్రజలు నిత్యం మురుగునీటి కష్టాలు తప్పడం లేదు. నిత్యం వేలాదిగా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆత్మకూరు బస్టాండు పల్లె ప్రాంతాల నుంచి బస్సులు దిగి ప్రజలు కాలినడకన నగరంలోకి వస్తుంటారు. మురుగునీటిలోనే ముక్కుమూసుకుని నడవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వంతెన కింద మురుగునీరు చేరకుండా చర్యలు చేపడతామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)



పూడికతీత.. సమస్యల మోత!



నగరంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదకరంగా విధులు నిర్వహిస్తున్నారు. తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పరిశుభ్రం చేస్తున్నారు. కాళ్ల చెప్పులు, చేతులకు గ్లౌజులు లేకుండా డ్రైనేజీల్లో పూడికలు తీస్తున్నారు. కార్మికులకు కనీస రక్షణ చర్యలు కల్పించడం లేదు. నగరంలోని 42, 43 డివిజన్లలో కార్మికులు కాలువల్లో ప్రమాదకరంగా పూడికతీత పనులు చేపడుతున్నారు. కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(ఫత్తేఖాన్‌పేట)

మందుల పంపిణీ

నెల్లూరు నగరం సంతపేట కామాక్షినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి బుధవారం పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మందులు అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు కోగిలి రమేశ్‌రాజు మాట్లాడుతూ బాధితుడికి ప్రతి నెలా దాతల సహకారంతో మందులు అందిస్తున్నామన్నారు. సంస్థ అధ్యక్షుడు ముని వెంకటసూర్య, సభ్యులు యశ్వంత్, బాలాజీ, వెంకటరమణ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)



రాళ్లతో దాడి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఇద్దరిపై కొందరు రాళ్లతో దాడి చేసి గాయపరిచిన ఘటనపై చిన్నబజారు పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంజీనగర్ మూడో వీధిలో అనూసింగ్ నివాసం ఉంటున్నారు. ఆయన తన స్నేహితులు వెంకటసాయికుమార్, చిరంజీవిలతో కలిసి మంగళవారం రాత్రి ట్రంకు రోడ్డు నుంచి రాధామాధవ్ హాలు వైపు వెళ్తుండగా ఓ బాలుడు వేగంగా వారి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో వారికి గాయాలయ్యాయి. అంత వేగంగా ఎందుకు వెళ్తున్నావని వారు బాలుడిని ప్రశ్నించగా, తాను చికెన్ చాంద్‌బాషా మనవడినని.. మీ అంతు చూస్తామని బెదిరించి వెళ్లిపోయాడు. దీంతో అనూసింగ్ అతని స్నేహితులు రియాజ్ హోటల్‌కు భోజనానికి వెళ్తుండగా లీలామహల్ సెంటరు వద్ద బాలుడి తండ్రి సర్దార్ మరికొంత మంది వారిని అడ్డగించి రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో అనూసింగ్, సాయికుమార్‌కు గాయాలయ్యాయి. వారు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులకు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

బద్వేలు, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు గ్రామీణ సీఐ నాగభూషణం తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కలువాయికి చెందిన రెండు టిప్పర్లను పీపీకుంట తనిఖీ కేంద్రం వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొదుపు సంఘాలను చట్టబద్ధంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా సహకార శాఖాధికారి గుర్రప్ప

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: పొదుపు సంఘాలను చట్టం ప్రకారం బైలాను అనుసరించి నిర్వహించుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి బి.గుర్రప్ప సూచించారు. నగరంలోని డీసీవో కార్యాలయంలో ముత్తుకూరు గ్రామం 49 స్వయం సహాయక బృందాల సభ్యులతో, రిజిస్టర్ అయిన సంఘబంధం మ్యాక్స్ సహకార సంఘ సభ్యులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం ఉద్దేశాలు, ఆశయాలు, సభ్యత్వం, సమావేశాలు, ఎన్నికలు, ఆడిటింగ్, వివాదాల పరిష్కారంపై వివరించారు.


రాష్ట్ర స్థాయి పోటీల్లో శిఖర్‌జైన్ ప్రతిభ



శిఖర్‌జైన్‌ను అభినందిస్తున్న రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్, కరస్పాండెంట్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఇటీవల తిరుపతిలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి పోటీల్లో నెల్లూరు రెయిన్‌బో స్కూల్ ఆరో తరగతి విద్యార్థి శిఖర్ జైన్ తైక్వాండో విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ విద్యార్థిని బుధవారం ఆ పాఠశాల డైరెక్టర్ పద్మసుబ్రహ్మణ్యం అభినందించారు. కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, కోచ్ సాగర్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగవతి.. భారతి.. శాంభవి.. శంకరి



బాలాజీనగర్ సీతాదేవికి సరస్వతి అలంకరణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి దంపతులు



కుంభ హారతులతో దర్శించుకుంటున్న భక్తులు



అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి సరస్వతి అలంకరణ



విరాట్‌నగర్‌లోని గాయత్రిదేవికి సరస్వతి అలంకరణ



కొత్తూరు వెంకయ్యస్వామి ఆశ్రమంలో బాల త్రిపురసుందరిగా

–న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం), జడ్పీ

అధికారిక మద్యం మాఫియా: కాకాణి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: అధికార పార్టీ పెద్దలు లిక్కర్ సిండికేట్ మాఫియాను నడుపుతున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని చోట్ల 30శాతం వాటా ఇవ్వాలని తెదేపా ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. మద్యం పాలసీని రద్దు చేసి పారదర్శకమైన విధానాన్ని తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవూరులో విషాదం చోటుచేసుకుంది. నవరాత్రుల సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు అలంకరణ స్తంభాన్ని తగలడంతో విద్యుదాఘాతానికి గురై తక్కెలపాటి నవీన్ కుమార్(26) అనే యువకుడు బుధవారం మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు నవీన్ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. బుధవారం రాత్రి నవీన్ స్థానిక యువకులతో ఆటలాడుకుంటుండగా ప్రమాదవశాత్తు అమ్మవారి మండపం వద్ద విద్యుత్తు స్తంభాన్ని తాకారు. విద్యుదాఘాతంతో కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతిపై కేసు నమోదు చేశారు. మృతుడి తండ్రి తక్కెలపాటి గురవయ్య అయిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి ధనమ్మ, చెల్లెలు ఉన్నారు.

విగ్రహాల ధ్వంసం తగదు

వరికుంటపాడు : విగ్రహాలను ధ్వంసం చేయడం తగదని వైకాపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని తోటలచెరువుపల్లెలో ఇటీవల వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. దీనిపై బుధవారం ఆ పార్టీ నాయకులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన కేసులో తోటలచెరువు పల్లి గ్రామానికి చెందిన ఆకుల శేషుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రఘునాథ్ తెలిపారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ క్యాంప్‌లు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట): జాతీయ తపాల ఉత్సవాల్లో భాగంగా గురువారం నెల్లూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని బిట్రగుంట ఐవోబీ బ్యాంక్ వద్ద మీ సేవ, కొడవలూరు సచివాలయం, కోవూరు కాచేరి సచివాలయం, నగరంలోని స్టోన్‌హౌస్‌పేట రామచంద్రాపురం, షాదీ మంజిల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్‌కార్డ్, ఆధార్‌కార్డులోని మార్పులు, చిరునామా మార్పు, మొబైల్ నంబరు అనుసంధానం తదితర సర్వీసులు ఉదయం 9గంటల నుంచి, సాయంత్రం 5గంటల వరకు ఉంటాయన్నారు.

పదవులు అనుభవిస్తూ.. వైకాపాను తిట్టడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: చంద్రబాబునాయుడు విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా గురువారం ఉదయం 10 గంటలకు కరెంటాఫీసు సెంటరులో ఆందోళన నిర్వహిస్తామన్నారు. పార్టీ మారిన కార్పొరేటర్లు రాజీనామాలు చేసి తెదేపా తరపున పోటీ చేసి గెలవాలన్నారు. పార్టీ పదవులు అనుభవిస్తూ వైకాపాను తిట్టడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ షేక్ సత్తార్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)



టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీధర్

నెల్లూరు నగరం, గ్రామీణం మండలాల పరిధి నానాటికి విస్తరిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల్లో అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని' టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లో..

నానాటికి పెరుగుతున్న వినియోగం

నెల్లూరు టౌన్ డివిజన్‌లో ఎల్‌టీ-1 వినియోగదారులు 2,07,520, ఎల్‌టీ-2లో 35,469, ఎల్‌టీ-3లో 1180, ఎల్‌టీ-4లో 2848, ఎల్‌టీ-5లో 75.. ఇలా మొత్తం 2,47,092 మంది వినియోగదారులున్నారు. నగరంలో నానాటికి వీరి సంఖ్య పెరుగుతోంది.

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నగరంలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ఇటీవల బోడిగాడితోటలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశాం. ప్రస్తుతం నగర పరిధిలో ఉన్న 12 సబ్‌స్టేషన్లకు అదనంగా కొత్తగా అయిదు నెలకొల్పుతాం. దీనికిగానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నగరంలో వీటి ఏర్పాటుకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్థలాలు కేటాయించారు. కేవీఆర్ పెట్రోల్‌బంక్, వెంగళరావునగర్, శ్రీహరినగర్, బీవీనగర్‌లోని రవాణశాఖ కార్యాలయం సమీపంలో, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం.

గాంధీబొమ్మ సమీపంలో కంటైనర్ సబ్‌స్టేషన్

కేవలం విజయవాడకే పరిమితమైన కంటైనర్ సబ్‌స్టేషన్ సేవలు నెల్లూరులోనూ అందనున్నాయి. కంటైనర్ సబ్‌స్టేషన్‌ను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు ఆనుకొని ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తాం.

వినియోగదారులకు ఇబ్బందులు రానివ్వం

విద్యుత్తు అంతరాయం లేకుండా ఉండేందుకు తరచూ సబ్‌స్టేషన్లను మెయింటెనెన్స్ కింద మరమ్మతులు చేసి సిద్ధం చేస్తున్నాం. తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వీటిని తరచూ తొలగించాల్సి వస్తోంది. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్స్ సామర్థ్యాన్ని పెంచి వినియోగదారులకు లోడ్‌ను అందిస్తున్నాం.

ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు

విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త కనెక్షన్లు, నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లను నగర పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బిగించాం. పగటి పూట విద్యుత్తు దీపాలు వెలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబరు 9133331912ను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: బాలాజీనగర్ సరస్వతినగర్‌లో డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. – సురేంద్రరెడ్డి

సమాధానం: డ్రైనేజీల్లో పూడికలు తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? వాకర్స్‌రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – సుల్తాన్

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

తెరపై ఈనాడు



ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్-2.. దేవర, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్2.. సత్యం సుందరం, స్క్రీన్3.. స్వాగ్, మా నాన్న సూపర్ హీరో, స్క్రీన్4.. వెట్టయ్యన్, స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, స్క్రీన్2. వెట్టయ్యన్, (తమిళం), స్క్రీన్3.. వెట్టయ్యన్, స్క్రీన్4.. స్వాగ్, సత్యం సుందరం, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. వెట్టయ్యన్, స్క్రీన్3. .విశ్వం, స్క్రీన్4.. మార్టిన్.